క్లుప్తంగా

క్రీడా సామగ్రి, ప్లేట్లు అందజేత



కోడూరు: స్వతంత్రపురం చామర్తి ప్రకాశరాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు రూ.60 వేల విలువ చేసే క్రీడా సామగ్రి, 200 భోజనం ప్లేట్లు, 400 స్టీల్ గ్లాసులను, పాఠశాల రికార్డులను భద్ర పర్చుకొనేందుకు ఇనుప బీరువాను అందించారు. పూర్వ విద్యార్థులను హెచ్‌ఎం ఆలా వెంకట రమణ అభినందించారు. పూర్వ విద్యార్థులు పూర్ణచంద్రరావు, డి.రవీంద్రబాబు, కె.రవికుమార్, బీవీ రమణ, వీఎస్‌ఆర్ కృష్ణ, కె.శ్రీనివాసరావు, సీహెచ్ గోవిందరాజులు, జి.ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పిల్లల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

కోడూరు: పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండటంతో పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోడూరు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఆలా వెంకటరమణ అన్నారు. ఆదివారం పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పరీక్షలకు 20 రోజులు కూడా లేవని, అన్ని సబ్జెక్టులను ఇంటి వద్ద రివిజన్ చేసేలా చూడాలని హెచ్‌ఎం సూచించారు. మార్కుల ఆధారంగా విద్యార్థులను గ్రేడింగ్ చేసి అవసరమైన వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యమన్నారు. వి.కొత్తపాలెం, సాలెంపాలెం, బడేవారిపాలెం, లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాలల్లో కూడా తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు.

21 మంది జూదరుల అరెస్ట్

పెడన: పేకాట శిబిరాలపై సెబ్ అధికారులు, పోలీసులు దాడులు నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి, శనివారం మధ్యాహ్నం జరిగిన దాడుల్లో 21 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.41,010లను స్వాధీనం చేసుకున్నారు. పెడన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెడన పట్టణం డీటీపాలెంలో శుక్రవారం రాత్రి జరిగిన దాడిలో 16 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.30 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. శనివారం మండలంలోని కోటవానిపాలెంలో ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.11,010లను స్వాధీనం చేసుకున్నారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ బంగార్రాజు ఆధ్వర్యంలో దాడులు జరిగాయి.

రీ సర్వేతో సమస్యల పరిష్కారం



కంకిపాడు: రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని వేల్పూరు సర్పంచ్ చెన్నుబోయిన శివనాగేంద్రమ్మ అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో రీ సర్వే ప్రక్రియ శనివారం నుంచి చేపట్టారు. శివనాగేంద్రమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ భూములను రీ సర్వే చేయించుకుని సంపూర్ణ హక్కులను పొందాలన్నారు. మాజీ సర్పంచ్ చెన్నుబోయిన జయరాం, ఈఓ వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బూసిమ్మతల్లి తిరునాళ్ల



ఉయ్యూరు: బూసిమ్మతల్లి తిరునాళ్ల భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మండలంలోని ముదునూరు గ్రామంలోని కూరాకుల వంశస్తుల ఇలవేల్పు బూసిమ్మతల్లి తిరునాళ్ల 15 రోజులు పాటు నిర్వహిస్తారు. ఈ తిరునాళ్లలో భాగంగా శనివారం భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కూరాకుల, పల్లపోతు వంశస్తులు విశేష పూజలు జరిపించి ఉత్సవాలను పర్యవేక్షించారు. ఆదివారం శిడిబండి ఉత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

రామవరప్పాడు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సీమాట్ (ఎస్‌ఐఈఎంఏటీ) డైరెక్టర్ మస్తానయ్య కోరారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. మస్తానయ్య మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని కోరారు. కష్టతరమైన పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా ఇప్పటి నుంచే విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. మంచి ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. వెనుక బడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సీమాట్ ప్రొఫెసర్లు మహేశ్వరరెడ్డి, రామ అరుణ, శారద, ఎస్‌ఎస్‌ఏ ఏఎంఓ బట్టు సురేష్‌కుమార్, సీఎంఓ తోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

లింకు రోడ్లతో తగ్గిన దూరం

- రాకపోకలు సులభతరం
- పంటను ఇళ్లకు తరలించేందుకు తొలగిన ఇబ్బందులు
- మంత్రి జోగి రమేష్ కృషితో అభివృద్ధి
- పలు గ్రామాల ప్రజలు హర్షం



నిర్మాణం అనంతరం సుందరంగా సాతులూరు లింకు రోడ్డు



నిర్మాణం పూర్తయిన తర్వాత ములపర్రు–మూలలంక రోడ్డు

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల మధ్య నిర్మించిన లింకు రోడ్లతో ప్రజలకు ప్రయాణ భారం తగ్గింది. గత టీడీపీ ప్రభుత్వం వీటిని పట్టించుకోకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బంటుమిల్లి మండలానికి సరిహద్దులుగా ముదినేపల్లి, కలిదిండి, కృత్తివెన్ను, పెడన మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లోని రైతులకు బంటుమిల్లి మండల పరిధిలో సాగు భూములు, బంధుత్వాలు ఉన్నాయి. ఈ మండలాల్లోని ప్రజలు రాకపోకలు చేసేందుకు, పండిన పంటను ఇళ్లకు చేర్చేందుకు లింకు రోడ్లు ఉపయోగించుకునేవారు. గత పాలకులు ఈ రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్య ధోరణి అవలంభించడంతో సుమారు పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు వ్యయప్రయాసలకు గురయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ చొరవతో లింకు రోడ్ల నిర్మాణం పూర్తయి అందుబాటులోకి రావడంతో ప్రయాణ దూరం తగ్గింది.

పలు లింకు రోడ్ల నిర్మాణం పూర్తి

ములపర్రు–మూలలంక ఆర్‌అండ్‌బీ రోడ్డు బంటుమిల్లి–కలిదిండి మండలాలకు లింకు రోడ్డుగా సేవలందిస్తోంది. ఈ రోడ్డు కృష్ణా–పశ్చిమ గోదావరి జిల్లాలకు అనుసంధానంగా భీమవరంలోని ఆక్వా వ్యాపారులకు దగ్గర మార్గంగా ఉపయోగపడుతోంది. ఈ రోడ్డు దాదాపు 40 ఏళ్లగా నిర్మాణానికి నోచుకోలేదు. ఈ క్రమంలో 2009లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అప్పుడు పెడన ఎమ్మెల్యేగా ఉన్న జోగి రమేష్ చొరవతో తొలిసారి తారు రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డుపై ఆక్వా రంగానికి చెందిన చిన్నా, పెద్ద వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగించాయి. కాలాంతరంలో రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలు పడటంతో వాహన చోదకులకు, శివారు గ్రామస్తులకు కష్టాలు తప్పలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పెడన ఎమ్మెల్యేగా ఉన్న జోగి రమేష్ కృషి చేసి దాదాపు రూ.2 కోట్లతో తారు రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. రెండు సార్లు రోడ్డు నిర్మాణం చేసినప్పుడు వైఎస్సార్ కుటుంబం తండ్రి, తనయుల పాలనలో, జోగి రమేష్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే జరగడం విశేషం.

అలాగే పెదతుమ్మిడి–అర్తమూరు జిల్లా పరిషత్ రోడ్డు నిర్మాణంతో బంటుమిల్లి, ముదినేపల్లి మండలాల్లోని ప్రజలకు జిల్లా కేంద్రం మచిలీపట్నానికి రాకపోకలు చేసేందుకు దగ్గర మార్గం ఏర్పడింది. ఇప్పటికే బంటుమిల్లి–మచిలీపట్నం 216 జాతీయ రహదారి విస్తరణ పూర్తి చేసుకుని అందుబాటులోకి వచ్చింది. పెదతుమ్మిడి–అర్తమూరు లింకు రోడ్డు జాతీయ రహదారికి అనుసంధానంగా ఉండటంతో వాహనదారులు రాకపోకలు చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే జోగి రమేష్ చొరవతో కేంద్ర ప్రభుత్వం పీఎంజీఎస్‌వై పథకంలో రూ. మూడు కోట్లు కేటాయించింది. ఈ నిధులతో రోడ్డును మణిమేశ్వరం గ్రామం వరకు విస్తరించి తారురోడ్డు నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా సకాలంలో పనులు చేయించుకోవడంలో గత పాలకులు విఫలం కావడంతో నిధులు మురిగిపోగా పాక్షిక పనులు చేసిన గుత్తేదారుడు చేతులు ఎత్తేశాడు. ఈ రోడ్డులో సాతులూరు గ్రామం వద్ద బంటుమిల్లి ప్రధాన కాలువపై ఇరిగేషన్ అధికారులు నిర్మించిన వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ. 3.5 కోట్లతో అంచనాలు కేంద్ర ప్రభుత్వానికి పంపామని నాబార్డు ఇంజినీరింగ్ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం సాతులూరు, చినతుమ్మిడి గ్రామాల రైతులు ఇరువైపులా స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న మట్టి రోడ్డుపై వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. వీటితోపాటు మండల పరిధిలోని పలు లింకు రోడ్ల నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ప్రజల కల నెరవేరింది



సంవత్సరాల తరబడిగా మంచి రోడ్డు చూడాలన్న ప్రజల కల నెరవేరింది. రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన మంత్రి జోగి రమేష్‌కు అందరూ కృతజ్ఞతగా ఉంటారు. దాదాపు 10 గ్రామాల ప్రజలకు ఈ రోడ్డు పరిధిలో భూములున్నాయి. పండిన పంటలు వ్యాపార కేంద్రాలకు చేరడానికి దగ్గర మార్గం ఏర్పడింది. గత టీడీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంతో రోడ్డు పూర్తి కాలేదు. తీర గ్రామాల్లో సౌకర్యాల ఏర్పాటులో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుంటోంది.

– వి. చినబాబు, ఎంపీపీ, బంటుమిల్లి

ఆక్వా రైతులకు ఎంతో ఉపయోగం



ములపర్రు–మూలలంక రోడ్డు నిర్మాణం ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం తెచ్చే ఆక్వా రంగానికి ఎంతో ఉపయోగపడుతుంది. వేలాది ఎకరాల్లోని చేపలు, రొయ్యలు అమ్మడానికి భీమవరం, ఆకివీడు వెళ్లడానికి మార్గం సుగమం అయ్యింది. దీనితోపాటు రెండు జిల్లాలు, అనేక మండలాల్లోని ప్రజల బంధుత్వాలకు దగ్గర మార్గం ఏర్పడింది. ఇది అంతా మంత్రి జోగి రమేష్ కృషితోనే సాధ్యమైంది. రెండు సార్లు ఈ రోడ్డు నిర్మాణం ఆయన హయాంలో జరగడం సంతోషంగా ఉంది. ఆయనకు మేమంతా ఎప్పుడు కృతజ్ఞతగా ఉంటాం.

– టి. శ్రీనివాసరావు, డైరెక్టర్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్, చోరంపూడి

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి జోగి రమేష్



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి జోగి రమేష్

మంత్రి జోగి రమేష్

పెడన: పెడన పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. స్థానిక గూడూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో పురపాలక సంఘానికి సంబంధించిన ఉన్నతాధికారులతో మంత్రి జోగి రమేష్ శనివారం సమావేశం నిర్వహించారు. తరకటూరు సమ్మర్ స్టోరేజ్ నుంచి రా వాటర్ సరఫరాకు వేయనున్న పైపులైన్ నిర్మాణంపై సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పైపులైన్ అలైన్‌మెంట్ దెబ్బతిని పైపుల ద్వారా నీరు వృథాగా పోతోందన్నారు. ఈ సమయంలో గూడూరులోని ప్రధాన రహదారి దెబ్బతింటోందని, ఇటువంటివి పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ ఎన్. శ్రీనివాసులు, ఈఈ భూషణం, డీఈ రాంప్రసాద్, ఏఈలు, మేఘా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులు, గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత మున్సిపల్ ఉన్నతాధికారులు మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి, గంగయ్యలతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు..

పెడన పట్టణ వాణిజ్య వర్తక విభాగానికి చెందిన టీడీపీ నాయకులు సోము వెంకటరత్నం, బొలిశెట్టి బాలరాజు, కాంగ్రెస్ నాయకుడు పువ్వాడ వెంకట సుబ్బారావు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి జోగి రమేష్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కష్టపడి పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లి, కౌన్సిలర్లు గంగయ్య, జయేష్, సుబ్రహ్మణ్యం, నాయకులు మతీన్‌ఖాన్, బట్టా దివాకర్, రౌతుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత, అమ్మఒడితో ఆదుకున్నారు

పేర్ని కిట్టు వద్ద మహిళల ఆనందం



మహిళలతో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయూత, అమ్మఒడి తదితర పథకాల ద్వారా తమను ఆదుకున్నారని పలువురు మహిళలు ఆనందం వ్యక్తంచేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 49వ డివిజన్ చెమ్మనగిరిపేటలో శనివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోలేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నలా, తమ్ముడిలా మమ్మల్ని ఆదుకుంటున్నాడని వివరించారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, చేయూత, రైతు భరోసా, ఆసరా, పింఛను కానుక వంటి పథకాల ద్వారా తమకు సాయం అందిస్తున్నారని చెప్పారు. స్థానికులు ముక్కు కనక మహాలక్ష్మీ, ముక్కు విజయ దుర్గారావు తమకు అందిన లబ్ధిని వివరించారు. తొలుత దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ పల్లి శేఖర్ పేర్ని, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కార్పొరేటర్లు మాచవరపు రాంప్రసాద్, ఐనం తాతారావు, జోగి చిరంజీవి, రామిశెట్టి వాణిశ్రీ పాల్గొన్నారు.

అదానీ స్కాంపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేయాలి

కాంగ్రెస్ రాష్ట్ర సమన్వయకర్త కొలనుకొండ శివాజీ



సమావేశంలో మాట్లాడుతున్న కొలనుకొండ శివాజీ

మచిలీపట్నంటౌన్: వ్యాపారవేత్త అదానీ స్కాంపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ చేయించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త కొలనుకొండ శివాజీ డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. శివాజీ మాట్లాడుతూ అదానీకి కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తూ క్విడ్‌ప్రోకో చేస్తున్నారని ఆరోపించారు. ప్రపంచ ధనవంతుల జాబితాలో 609వ స్థానంలో ఉన్న అదానీ బీజేపీ పాలనలో రెండు, మూడు స్థానాలకు చేరాడని చెప్పారు. అదానీ స్కాం ద్వారా రూ. 10 లక్షల కోట్ల ప్రజాధనం ఆవిరైందన్నారు. అదానీ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 13వ తేదీన చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు లాం తాంతియాకుమారి మాట్లాడారు. పెడన, పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గాల కాంగ్రెస్ ఇన్‌చార్జీలు లింగాల సుధాకరరావు, పెదపూడి దిలీప్‌కుమార్, దీక్షా వీరరాఘవులు, నున్న శ్రీరాం, నల్లబ్రోలు కుమారి, చిలుకోటి ప్రసాద్ పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు పెరటి కోళ్ల పంపిణీ

తొలి దశలో 60 యూనిట్లు



పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కానూరులో డ్వాక్రా మహిళలకు శనివారం పెరటి కోళ్ల పంపిణీ చేశారు. యూనిట్‌కు రూ.3,970 డ్వాక్రా మహిళలు చెల్లిస్తే 11 కోళ్లు ఇస్తారు. ఇందులో 8 పెట్టలు, 3 పుంజులు ఉంటాయి. ఒక్కో కోడి దాదాపు కిలో బరువు ఉంటుంది. ఇవి నాలుగు నెలల్లో గుడ్లు పెడతాయి. ఈ గుడ్లు తినటం వలన మహిళల్లో రక్తహీనత తగ్గుతుంది. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు గుడ్లు తినటం వలన అధిక ప్రొటీన్లు వారికి లభిస్తాయి. డ్వాక్రా మహిళలు పెరటి కోళ్ల పెంపకానికి మొదటి విడతగా మండలంలో 60 యూనిట్లు గ్రౌండ్ చేశామని ఏపీఎం నాగభూషణం తెలిపారు. త్వరలో మరిన్ని యూనిట్లు గ్రౌండ్ చేస్తామన్నారు. డ్వాక్రా మహిళలు పెరటి కోళ్ల పెంపకానికి ముందుకు రావాలని సూచించారు.

90 మంది వృద్ధులకు నేత్ర వైద్య పరీక్షలు



కంకిపాడు: కంటి వెలుగుతో కంటి సమస్యలు పూర్తిగా దూరమవుతాయని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం శనివారం చేపట్టారు. 90 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి పలువురికి మందులు పంపిణీ చేశారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధుల కంటి సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఎల్‌హెచ్‌పి బి.జయశ్రీ, ఏఎన్‌ఎం పి.శైలజ పాల్గొన్నారు.

తాడంకి హైస్కూల్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాన్ని అందుకుంటున్న కంభపు రామ నాగ దివిజ

పామర్రు(పమిడిముక్కల): తమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ప్రతిభా పురస్కారాలు అందుకుని నగదు ప్రోత్సాహకాలు పొందారని తాడంకి హైస్కూల్ హెచ్‌ఎం శారదాకాంత తెలిపారు. ఆమె శనివారం పాఠశాలలో మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో కోరమాండల్ వారు నిర్వహించిన బాలికల ప్రతిభా పురస్కారాలను హైస్కూల్ విద్యార్థులు సాధించారని అన్నారు. పదో తరగతి చదువుతున్న కంభపు రామ నాగదివిజకు ప్రథమ బహుమతిగా రూ.5 వేల నగదు, ప్రతిభా పురస్కారాన్ని అందజేశారన్నారు. ద్వితీయ బహుమతిగా సత్య ప్రసన్నకు రూ.3,500 నగదు, ప్రశంసా పత్రాలు ఇచ్చారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అందజేశారని తెలిపారు. పురస్కారాలు అందుకున్న బాలికలను జెడ్పీటీసీ ఏనుగ వెంకట రమణకుమారి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కంభపు రాంబాబు, పీడీ ఏపీ రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

ధ్యాన కేంద్రం పనులు ప్రారంభం

తోట్లవల్లూరు: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం, మానసికొల్లాసం లభిస్తుందని పిరమిడ్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లూరు శివనాగకృష్ణ తెలియజేశారు. బొడ్డపాడులో జాజుల పెద నాగేశ్వరరావు నివాసం వద్ద పిరమిడ్ ధ్యానకేంద్రం నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. సర్పంచ్ మూడే శివ శంకరరావు, ఉషశ్రీ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ ఘటనపై కేసు నమోదు

కంకిపాడు: చంపుతామని బెదిరించి నగదు దోపిడీ చేసిన ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఎస్‌ఐ కె.సుధాకర్ కథనం ప్రకారం.. మండలంలోని మద్దూరు గ్రామ పరిధిలో కరకట్టపై ఉన్న పెట్రోలు బంకు వద్ద ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు పెట్రోలు బంకులోకి వెళ్లి బంకులో పనిచేస్తున్న వీరంకి శ్రీనివాసరావును కొట్టి చంపుతామని బెదిరించి అతని వద్ద ఉన్న రూ.30 వేలు నగదు దోపిడీ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

మూడు వేల మందికి అన్నసమారాధన

కైకలూరు: వేమవరప్పాడులో గంగానమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 9.18 గంటల ముహూర్తానికి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. సర్పంచ్ నున్న రాంబాబు, తలారి శ్రీహరి, ద్వారంపూడి సుబ్బిరెడ్డి, బోయిన సురేష్, నున్న శ్రీనివాసరావు దంపతులు ఉభయదాతలుగా పూజలు జరిపారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ, సయ్యపురాజు గుర్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు చేబోయిన వీర్రాజు తదితరులు పాల్గొన్ని అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో జాజుల రాజు, బుర్ల శ్రీను, నున్న కాసులు, గొల్లబాబు, శ్రీనివాసరావు, తలారి మంగారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

గూడూరు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం గూడూరులోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహిస్తామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిపర్తి రవికుమార్ తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కేక్ కట్ చేసి మహిళలు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తారని చెప్పారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెడన: బలిపర్రు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్. రూతమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులు ప్రభుత్వం లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నాలుగో తరగతి చదివి ఉండాలన్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంఈసీ, సీఈసీలో ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానించామన్నారు. వీరంతా ఏపీజీపీసీఈటీ.ఏపీసీఎఫ్ ఎస్‌ఎస్.ఇన్ ఆన్‌లైన్‌లో ఐదో తరగతి వారు, ఆబ్లిక్ ఇంటర్ అని ఇంటర్మీడియట్ వారు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందన్నారు. ఇంటర్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు బలిపర్రులోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

రోడ్లు దెబ్బతినకుండా పైప్‌లైన్ నిర్మించాలి

గూడూరు: రోడ్లు దెబ్బతినకుండా పెడన పురపాలక సంఘానికి తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ నిర్మాణానికి అధికారులు అంగీకరించారు. తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి పెడన పురపాలక సంఘానికి తాగునీరు సరఫరా చేసేందుకు గూడూరు గ్రామంలోని పెడన రోడ్డు మార్గంలో భూగర్భ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.38 కోట్లు మంజూరు చేసింది. మేఘా ఇంజినీరింగ్ సంస్థ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించగా.. రోడ్డుపై భారీ వాహనాలు నడుస్తుండటంతో తరచూ పైప్‌లైన్ లీకేజీ ఏర్పడి రోడ్లు దెబ్బతింటున్నాయని స్థానిక నాయకులు పనులు నిలిపివేయించి సమస్యను మంత్రి జోగి రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి జోగి రమేష్ పనులు పర్యవేక్షిస్తున్న ప్రజారోగ్య ఇంజినీరింగ్ అధికారులను క్షేత్రస్థాయికి వెళ్లి పైప్‌లైన్ నిర్మాణానికి ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో శనివారం సంబంధిత శాఖ ఎస్‌ఈ ఎస్.శ్రీనివాసులు, ఈఈ డి.భూషణం, మేఘా ప్రాజెక్టు మేనేజర్ ఎం.వీరారెడ్డి, డీఈ రాంప్రసాద్. వి.మహేష్‌లు గూడూరులో పర్యటించారు. ఈ సందర్భంగా పైప్‌లైన్ లీకేజీల కారణంగా రోడ్లు దెబ్బతినకుండా భూగర్భ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, లింగం విజయ్‌కుమార్, అట్లూరి వెంకటేశ్వరరావులు ఇంజినీరింగ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పెడన రోడ్డు మార్గంలో కాకుండా లజ్జబండ మురుగుకాలువ గట్టు వెంబడి పైప్‌లైన్‌ను తుమ్మలపాలెం రోడ్డు వరకు తీసుకెళ్లి, అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం ముందు నుంచి పెడన రోడ్డు వైపునకు పైప్‌లైన్ నిర్మిస్తే రోడ్డు ఎక్కడా పాడవ్వదని స్థానిక నాయకులు ఇంజినీరింగ్ అధికారులకు వివరించారు. దీనిపై సంతృప్తి వ్యక్తంచేసిన అధికారులు నాయకులు సూచించిన మార్గంలో పైప్‌లైన్ నిర్మాణానికి అంగీకరించారు. దీనిపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మునగాకుతో గర్భిణులకు భోజనం

విజయవాడరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు మునగాకు కలిపి భోజనం అందించాలని కంకిపాడు ప్రాజెక్ట్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి బేబి సుకన్య తెలిపారు. ఈ మేరకు గ్రామాల్లోని అంగన్‌వాడీ టీచర్లకు శుక్రవారం ఆమె సమాచారం పంపించారు. మునగాకులో రక్తం వృద్ధి చెందే పోషక విలువలున్నందున తప్పనిసరిగా వంట చేసి అందించాలని సూచించారు. పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు పోషక విలువలున్న మునగాకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి వారంలో బుధవారం వరకు ఎగ్ కర్రీ ఉంటుందని, గురువారం ఎగ్‌ఫ్రైడ్ రైస్ అందిస్తామన్నారు. శుక్రవారం సొరకాయ లేదా దోసకాయ శనివారం వెజిటబుల్ రైస్ వడ్డిస్తామని తెలిపారు. పిల్లలకు ఎగ్‌తో పాటు మిరియాల పొడి కలిపి ఇస్తున్నామన్నారు.

చలివేంద్రం ప్రారంభం

హనుమాన్‌జంక్షన్ రూరల్: వేసవిలో ఎండ తీవ్రతకు పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు వీలుగా చలివేంద్రం ఏర్పాటు చేయటం హర్షణీయమని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద సమాచార హక్కు చట్టం ప్రచార సమితి అమరావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. తొలిరోజు చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు.